క్లుప్తంగా

పాలనశాస్త్ర విభాగానికి విరాళం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగానికి ఆ విభాగం స్కాలర్స్ భూక్య రమేష్, జీడీ.కనకయ్య, న్యాతాని సుధీర్‌కుమార్.. రూ.40వేల విలువ చేసే ఏసీ యంత్రాన్ని శనివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విభాగం అధిపతి పెదమళ్ల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం అభివృద్ధి చేయూతనందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ యాదగిరిరావు, కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ బుర్రి ఉమాశంకర్, డాక్టర్ మోహన్, స్కాలర్స్ పాల్గొన్నారు.

భక్తులను ఆకట్టుకున్న నృత్యాలు



కాజీపేట: హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో నృత్య కళాకారులు శనివారం ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ వ్యాఖ్యాత, రామాలయ ఇన్‌చార్జ్ శనిగరపు రాజ్‌మోహన్ జ్యోతిప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. గోపిక టీమ్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కళాకారులను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ సన్మానించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామార్చన, తులసీమాల సేవనం చేశారు.

హనుమాన్ భక్తుల శోభాయాత్ర



వరంగల్: 14వ డివిజన్ ఏనుమాముల పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో హనుమాన్ మాల ధారుల ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. శోభాయాత్రలో గురుస్వాములు చల్వారి యాదగిరి, గడ్డల ఉపేందర్, అబ్బరబోయిన కుమారస్వామి, కొమ్ము రంజిత్, గాజ నాగరాజు, గంద్ర శ్రీనివాస్, మాలోతు వీరన్న, పల్లెపాటి రమేష్‌రెడ్డి, కన్నె స్వాములు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి సహస్ర పుష్పాభిషేకం

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని పురాతన దేవాలయమైన రంగనాథస్వామి దేవాలయంలోని దక్షిణముఖ ఆంజనేయస్వామికి శనివారం సహస్ర పుష్పాభిషేకం నిర్వహించారు. అంతకుముందు ఉదయం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు, సభ్యులు మోటం శ్రీనివాస్, మంచాల సృజన, నీలం శ్రీనివాస్, కూరపాటి రవికుమార్, గడ్డం భాస్కర్, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

పాఠశాల పూర్వ వైభవానికి కృషి

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కుమ్మరిగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పూర్వవైభవానికి మాజీ సర్పంచ్, సామాజిక కార్యకర్త నల్లమారి రమేష్, పలువురు యువకులు కృషి చేస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు.

క్రికెట్ విజేత కాజీపేట జట్టు

మడికొండ: కాజీపేట మండలం మడికొండలో వాల్మీకి మహర్షి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమకొండ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈమేరకు విజేత జట్టుగా కాజీపేట లెవన్‌జట్టు నిలిచింది. విజేత జట్టుకు షీల్డ్‌తో పాటు రూ.30 వేల ప్రైజ్‌మనీని అందజేశారు. అలాగే, రన్నర్ జట్టు డీజిల్ కాలనీ లెవన్ జట్టుకు షీల్డుతో పాటు రూ.15 వేలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, నిర్వాహకులు బోగి సురేష్, నర్ర భాను, క్రాంతి, 64వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్ల మోహన్, దువ్వ విజయ్, కొప్పుల నవీన్‌యాదవ్, వేణుయాదవ్, వినయ్, గౌతమ్, చంటి, అప్పి, సామిల్, కొలంబో పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజీపేట – పెండ్యాల రైల్వే స్టేషన్ల మధ్య గల ధర్మపురం రైల్వేగేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ ఎస్సై మొహినొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 35 ఏళ్ల వయస్సు గల మృతుడి ఎడమ చేతిపై ఎస్ అని రాసి ఉందని తెలిపారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విత్తన షాపులపై నిరంతర నిఘా పెట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న నాయకులు



రైతులకు సూచనలిస్తున్న ఏఓ శ్రీధర్ రెడ్డి



హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సురేష్

వరంగల్: రైతులకు విత్తనాలు అమ్మే షాపులపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల బ్లాక్ మార్కెటింగ్ దందాను అరికట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఫిర్యాదు మేరకు వ్యవసాయ శాఖ జిల్లా జేడీ, అధికారులు వరంగల్ స్టేషన్‌రోడ్‌లోని పలు విత్తన విక్రయ షాపులను శనివారం తనిఖీ చేస్తున్న సమయంలో రైతు సంఘం నాయకులు వారి వెంట ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ తనిఖీలు ఒక రోజుకే పరిమితమై తూతూ మంత్రంగా ముగిస్తే రైతులకు ఏమాత్రం ఉపయోగం ఉండదని అన్నారు. దీన్ని నిరంతర ప్రక్రియగా చేపట్టాలని కోరారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసే దళారులను అమ్మే షాపులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని పీడీ యాక్ట్ నమోదు చేయాలని సూచించారు. అలాగే, రైతుల అవసరాల దృష్టిలో పెట్టుకొని డిమాండ్ ఉన్న విత్తనాలను కృత్రిమ కొరత సృష్టించి విక్రయించే షాపు యజమానుల లైసెన్స్‌లను అధికారులు రద్దు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న దళారుల నుంచి రైతులను రక్షించేందుకు రైతు సంఘం తన వంతు పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ విఘ్నేష్, రైతు సంఘం జిల్లా నాయకులు సిరుల రవీందర్, బరుపాటి రవీందర్, బొల్లు ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

కాజీపేట / మడికొండ: వర్షాకాలంలో పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులు విత్తనాల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దొండపాటి శ్రీధర్ రెడ్డి సూచించారు. విత్తనాల ఎంపికలో అనుసరించాల్సిన పద్ధతులపై కాజీపేట మండలంలోని పలు గ్రామాల్లోని రైతులకు శనివారం అవగాహన కల్పించారు. సోమిడి, భట్టుపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల రైతులతో మాట్లాడుతూ ఆధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని వివరించారు. రసీదులు తప్పకుండా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్

హసన్‌పర్తి: నాసిరకం విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్ హెచ్చరించారు. హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాల్లో షాపులు నిర్వహిస్తున్న ఎరువుల డీలర్లతో వ్యవసాయ శాఖ, పోలీస్‌శాఖల సంయుక్త ఆధ్వర్యంలో హసన్‌పర్తి రైతువేదికలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రైతులకు తప్పకుండా రసీదు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ డీలర్లు స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డ్, బిల్లు బుక్స్, రైతుల వారీగా విక్రయాలు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలు విక్రయించాలన్నారు. సమావేశంలో ఏఓ అనురాధ, రైతులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



నయీంనగర్: మాట్లాడుతున్న రియాజ్

కేయూ క్యాంపస్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కేయూలోని లైబ్రరీలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచి నికార్సైన జర్నలిస్టుగా పేరొందిన తీన్మార్ మల్లన్నకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

బీఆర్‌ఎస్, బీజేపీ ఓటమిని అంగీకరించాయి

నయీంనగర్: వరంగల్ – నల్గొండ – ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల్లో ఓటమి భయంతో బీఆర్‌ఎస్, బీజేపీలు లోపాయికారిగా ఒప్పందం కుదుర్చుకున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రియాజ్, జాతీయ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విమర్శలకు, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలకు బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు, ప్రతినిధులు దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

వరంగల్ చౌరస్తా: తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ విజ్ఞప్తి చేశారు. వరంగల్ 27వ డివిజన్‌లోని దయానంద్ కాలనీలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మల్లన్న గెలుపు కోరుతూ ప్రచారం

హసన్‌పర్తి: తీన్మార్ మల్లన్న గెలుపు కోరుతూ 66వ డివిజన్ హసన్‌పర్తి, సీతంపేటలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నద్దునూరి చేరాలు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి

హన్మకొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించుకుందామని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరీ సతీష్ పిలుపునిచ్చారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర కమిటీ మద్దతు



నయీంనగర్: వరంగల్ – నల్గొండ – ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌కుమార్‌కు బీఎస్పీ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుండాల మదన్‌కుమార్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడే గొంతుక అశోక్ కుమార్‌ను గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పసుల వినయ్, సారయ్య, జన్ను అనిల్, ప్రవీణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి



మామునూరు: పట్టణ ప్రాంత మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఐద్వా రాష్ట్ర నేత నలిగంటి రత్నమాల సూచించారు. వరంగల్ బెస్తం చెరువులోని లక్ష్మీపురంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు దూరిశెట్టి వెంకటలక్ష్మి అధ్యక్షతన ఐద్వా కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ పట్టణ మహిళలు పనులులేక ఖాళీగా ఉంటున్నారని, అధికారులు స్పందించి వారికి ఉపాధి కల్పించాలని కోరారు. సమావేశంలో అనూష, ఈసంపెల్లి మంజుల, కల్పన, పద్మక్క, ఎలిషా, సంగీత, జ్యోతి, సేమియం, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ దగాకోరు పాలన



హన్మకొండ: మాట్లాడుతున్న బాల్క సుమన్

హన్మకొండ: రాష్ట్రంలో నడుస్తోంది ప్రజాపాలన కాదని, దగా పాలన అని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ హత్యాకాండలు కొనసాగిస్తోందని ఆరోపించారు. తీన్మార్ మల్లన్న బ్లాక్ మెయిలర్ అని, అలాంటి వ్యక్తులను పెద్దల సభ శాసన మండలికి పంపొద్దని సూచించారు. ప్రజలు, సమాజం గురించి ఆలోచించి, బాధ్యతగా వ్యవహరించే వారిని మాత్రమే ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలన్నారు. రాష్ట్రంలో బ్రూ టాక్స్ (బట్టి, రేవంత్, ఉత్తమ్) నడుస్తోందని, మల్లన్న గెలిస్తే దానికి తోడు క్యూ టాక్స్ కూడా వస్తుందన్నారు. బీజేపీ దేశానికి, రాష్ట్రానికి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ప్రజలు, పట్టభద్రుల సమస్యలపై పోరాడుతారని అన్నారు. సమావేశంలో నాయకులు మర్రి యాదవరెడ్డి, కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, జోరిక రమేష్, ప్రశాంత్, శరతచంద్ర, అరూరి రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రాకేష్‌రెడ్డిని గెలిపించండి

కేయూ క్యాంపస్: ప్రభుత్వంపై కొట్లాడే తనను పట్టభద్రులు ఆశీర్వదించి ఎమ్మెల్సీగా గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి కోరారు. కాకతీయ యూనివర్సిటీలోని పలు విభాగాల్లో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 56 కేసులున్న తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పాలాకుల కొమురయ్య, కత్తెరపెల్లి దామోదర్, బీఆర్‌ఎస్‌వీ కేయూ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, బీఆర్‌ఎస్‌వీ కేయూ నాయకులు కందికొండ తిరుపతి, కొనుకటి ప్రశాంత్, పిన్నింటి విజయ్‌కుమార్, పసునూరి టోని, రాజశేఖర్, సురేష్, శ్రీధర్, కొమురం సిద్ధు తదితరులు పాల్గొన్నారు.


లారీ ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

ఖిలా వరంగల్: సైకిల్‌ను లారీ బలంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం ఉదయం వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారి తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం రంగశాయిపేట ప్రాంతానికి చెందిన కందగట్ల సదానందం ఓ ప్రైవేట్ ట్రాక్టర్స్ షోరూంలో పనిచేస్తున్నాడు. రోజు వారీగానే శనివారం ఉదయం ఇంటి నుంచి సైకిల్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో ఖమ్మం జాతీయ రహదారిపై వరంగల్ తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల సమీపంలో సైకిల్‌ను యూటర్న్ తీసుకుంటున్న లారీ ఢీకొట్టింది. దాంతో సైకిల్ పూర్తిగా ధ్వంసం కాగా, సదానందం రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మిల్స్‌కాలనీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని లారీ అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

షాపులను తొలగించండి

హసన్‌పర్తి: ఎస్సారెస్పీ క్యాంప్ ప్రధాన ప్రహరీని ఆనుకుని ఏర్పాటు చేసిన షాపులను తొలగించాలని అధికారులు తెలిపారు. ఈమేరకు షాపుల వద్ద నోటీసులు అంటించారు. షాపుల కారణంగా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ నోటీసులో పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు కూడా అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. షాపులు తొలగించకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.


బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని ఆదరించండి



ప్రచారం చేస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. వరంగల్‌లోని పలు డివిజన్లలో 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్, జిల్లా కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, 28 డివిజన్ అధ్యక్షుడు రామిని సుమన్, నాయకులు నవీన్, కొత్తపెల్లి రాజేష్, మురళీధర్ చారి, విఠల్, మైదం వీరస్వామి, క్రాంతి, ఎర్రం శ్రీనివాస్, కల్యాణ్, దేవేందర్, లోకేష్, పవన్‌రాజ్, కిరణ్, అజయ్, రోహిత్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కలకత్తా హైకోర్టు తీర్పు అభినందనీయం



మమత ఫొటోలను చింపివేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ఓబీసీ రిజర్వేషన్ కోటా నుంచి ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పు అభినందనీయమని బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ అన్నారు. ఈమేరకు ఖిలా వరంగల్ తూర్పుకోటలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాంద్రె అమర్‌నాథ్ ఆధ్వర్యంలో శనివారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ కల్పించిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతబెనర్జీ చిత్రపటం, ప్రతాలను ఓబీసీ కార్యకర్తలు చింపి వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓబీసీల 27శాతం రిజర్వేషన్‌లో అందులోని 4శాతం రిజర్వేషన్‌ను ముస్లింలకు ఇవ్వడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు నష్టం జరిగిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో బొలుగొద్దు సతీష్, అచ్చ జనార్దన్, నాగేందర్, గన్నారపు రవీందర్, అమృత్, బోళ్ల కిరణ్, కందిమల్ల హస్తిక్, బిళ్ల శివ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'సఖి' అవగాహన కార్యక్రమం



నయీంనగర్: సఖి సెంటర్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను కిషన్‌పుర గర్ల్స్ హాస్టల్ విద్యార్థినులకు కేస్ వర్కర్ హరిత వినీల శనివారం వివరించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో బాధిత మహిళలు, బాలికలకు ఉచిత వైద్య సహాయం, కౌన్సెలింగ్, న్యాయ, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. బాధితులు తక్షణ రక్షణ కోసం 181 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎల్.మూర్తి

విద్యారణ్యపురి: రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధికంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని, ఈక్రమంలో ఫీజుల నియంత్రణకు ఓ చట్టం తీసుకు రావాల్సిన అవసరం ఉందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్.మూర్తి సూచించారు. హనుమకొండలోని రాంనగర్‌లోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పలు విద్యార్థి, ప్రజా సంఘాల బాధ్యులతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో 'ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం – ఆవశ్యకత' అనే అంశంపై ఆయన మాట్లాడారు. కొన్ని విద్యాసంస్థలు ప్రాథమిక స్థాయి విద్యకే లక్షల రూపాయల డొనేషన్లు తీసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి విద్యాసంవత్సరం 25శాతం నుంచి 30శాతం వరకు ఫీజులు పెంచుతున్నాయని వాపోయారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఏబీఎస్‌ఎఫ్, ఏఐడీఎస్‌ఓ, ఐద్వా సంఘం, బీఎస్‌ఎఫ్, గిరిజన సంఘం, ఏఐకేఎస్, సీఐటీయూ బాధ్యులు చుక్కయ్య, బొట్ల చక్రపాణి, వాంకుడోతు వీరన్న, సాంబయ్య, దీప, జయశ్రీ, మర్రి మహేష్, మంద నరేష్, బొట్ల మనోహర్, శ్రావణ్, సత్యనారాయణ, శివ, రాజిరెడ్డి, సాయికుమార్, మాసాని ప్రదీప్, అరుణ్, పవన్, పృథ్వీరాజ్, సాయి కొబ్లర్, మంగీలాల్, రమేష్, అనూష, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

డీబీఎఫ్ రాష్ట్ర మహాసభకు తరలిరావాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈనెల 30న జరగనున్న దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర మహాసభకు దళిత, బహుజనులు అధిక సంఖ్యలో తరలిరావాలని డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద డీబీఎఫ్ నాలుగవ మహాసభ కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో వివక్షకు గురవుతున్న దళిత, పీడిత, అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ వారి తరపున ప్రశ్నించే ప్రజా గొంతుకగా దళిత బహుజన ఫ్రంట్ నిలుస్తోందని వివరించారు. అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన సిద్ధాంత పునాదిపై ప్రతిఒక్కరూ పనిచేస్తూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కొండ్ర నర్సింగరావు, సింగారపు రవి ప్రసాద్, అంకేశ్వరపు రాంచందర్ రావు, దూడపాక రాజేందర్, రవి, చుంచు మల్లయ్య, డీఎస్.ప్రభాకర్, ఐతం నగేష్, బొర్ర సంపూర్ణ, చుంచు నరేష్, మేకల అనిత, కేడల ప్రసాద్, వంశీ, కుమార్, చందు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న యూనియన్ నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకోషెడ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తూ జనగామ రైల్వే స్టేషన్‌లో ఇటీవల రౌతు దయాకర్ మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు శనివారం పరామర్శించి రూ.25 వేల విలువగల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీజిల్ బ్రాంచ్ సెక్రటరీ పాక వేదప్రకాష్, డీఎల్‌ఎస్ బ్రాంచ్ మజ్దూర్ యూనియన్ నాయకులు తిరుపతి, భాస్కర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, రవికిరణ్, శివప్రసాద్, శీను పాల్గొన్నారు.



మామునూరు: నగదు అందజేస్తున్న సుభాకర్

తిమ్మాపురంలో..

మామునూరు: ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రావుఫ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను జనతా గ్యారేజ్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు సుభాకర్ రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజేందర్, పండు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల పనితీరు మెరుగుకు పోటీలు

- మొదటిదఫా హనుమకొండ జిల్లాకు బహుమతులు



బహుమతి అందజేస్తున్న మోహన్ రావు

హన్మకొండ : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం విద్యుత్ ఇంజనీర్లు, ఉద్యోగుల మధ్య పనితీరు మెరుగుపరిచేందుకు 'బెస్ట్ ఫర్మానెన్స్ ఆఫ్ ద మంత్' పేరుతో బహుమతులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. దీనిని ఉమ్మడి జిల్లా స్థాయిలో అమలు చేస్తున్నారు. తద్వారా ఎన్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు గణనీయంగా తగ్గించడంలో ఉద్యోగుల పనితీరు మెరుగుపడుతుంది. అయితే ఉద్యోగుల పనితీరు మెరుగుపరిచేందుకు ఇప్పటికే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. దీంతో పాటు పోటీతత్వం పెంచడంతో పాటు ఒకరి నుంచి మరొకరు స్ఫూర్తి పొందేలా ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి.. 'బెస్ట్ ఫర్మారెన్స్ ఆఫ్ ద మంత్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 20 పారామీటర్స్‌లో పనితీరు బేరీజ్ వేసి ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా మే నెలలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ సర్కిల్‌కు బహుమతులు దక్కాయి. హనుమకొండ సర్కిల్‌లో రెండు డివిజన్లుగా హనుమకొండ డివిజన్‌లో హనుమకొండ డీఈ జి.సాంబ రెడ్డి, హనుమకొండ ఏడీఈ పి.మల్లికార్జున్, కడిపికొండ ఏఈ కె.జగదీశ్వర్ రెడ్డి, హనుమకొండ రూరల్ డివిజన్‌లో ఆత్మకూరు ఏఈ డి.రవికుమార్ బహుమతులు గెలుచుకున్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆపరేషన్ డైరెక్టర్ వి.మోహన్ రావు విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీజీఎం కిషన్, డీఈలు జి.సాంబ రెడ్డి, సామ్యా నాయక్, ఏడీఈలు నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్ రావు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రాజ్‌పాల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హన్మకొండ: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యూఈఈయూ) వరంగల్ జిల్లా కార్యదర్శి ఎల్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యల పరిష్కారం కోసం యూనియన్ రాష్ట్ర కమిటీ దశల వారీగా పోరాట కార్యక్రమాలకు పిలుపునిచ్చిందన్నారు. ఇందులో భాగంగా గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ రూరల్ డివిజన్ కార్యాలయంలో వినతి పత్రాలు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు, బిల్ కలెక్టర్లు, ఆర్టిజన్లు, మీటర్ రీడర్లు, అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యాలను కోరారు. కాగా, దశల వారీగా ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 28న సూపరింటెండెంట్ ఇంజనీర్లకు, జూన్ 10న సీఎండీలకు ఉద్యోగులు సామూహిక దరఖాస్తులు అందించనున్నట్లు తెలిపారు.